సాక్షి పెద్దపల్లి

శుక్రవారం, 29, సెప్టెంబర్, 2023

'చంద్రయాన్-3'పై ఊరేగిన గణపతి

మంథని: విశ్వబ్రాహ్మణులు తమ వృత్తి నైపుణ్యం ప్రదర్శిస్తూ విభిన్న రూపాల్లో తయారు చేసిన వాహనాల్లో వినాయకుడిని ఊరేగించడం ఆనవాయితీ. సుమారు 50ఏళ్లకుపైగా ఏటా నవరాత్రులను నిర్వహిస్తున్న నిర్వాహకులు.. ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తులను ఆకట్టుకునేలా.. వినాయకుడికి వీడ్కోలు పలుకుతారు. ఇటీవల ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతం కావడంతో చంద్రయాన్-3 రాకెట్ నమూనాలోనూ ప్రత్యేకంగా తయారు చేసిన సెట్టింగ్‌లో గణేశుని శోభాయాత్ర నిర్వహించి ఆకట్టుకున్నారు.



న్యూస్‌రీల్

కేంద్రమంత్రికి ఘనస్వాగతం



సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జ్యోతినగర్(రామగుండం): కేంద్ర ఫిషరీస్, ఆనిమల్ హస్బెండరీ, డెయిరీ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల శుక్రవారం రామగుండంలో పర్యటించనున్నారు. గోదావరిఖనిలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగే సమావేశానికి ఆయన హాజరవుతారు. ఈమేరకు ఆయన గురువారం రాత్రి ఆయన ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌కు చేరుకున్నారు. మంత్రి పురుషోత్తం రూపాలకు ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ జ్యోతిభవన్ వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పిడుగు కృష్ణ, మల్లాకార్జున్ తదితరులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో వచ్చేనెల ఒకటో తేదీన నిర్వహించనున్న బహిరంగ సభకు పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హాజరుకానున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గురువారం రాత్రి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లతో కార్పొరేటషన్ డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థలోని 12 జోన్ల సూపర్‌వైజర్లు చేయాల్సిన పనులపై వారితో చర్చించారు. రామగుండం తహసీల్దార్ కార్యాలయం నుంచి సింగరేణి జవహర్ లాల్ స్టేడియం వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టడానికి 12 మంది సూపర్‌జర్లకు త్రియంబకేశ్వర్‌రావు విధులు కేటాయించారు. నగరంలోని రహదారులకు ఇరువైపులా చెత్త తొలగించి శుభ్రం చేయాలని సూచించారు. అన్ని డివిజన్లలో శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోజు మధ్యాహ్నం 3గంటల వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కొనసాగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్ సుందర్, సునీల్ పాల్గొన్నారు.

రేపు 'చలో హైదరాబాద్'

సుల్తానాబాద్ (పెద్దపల్లి): ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 30న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కోలేటి రమేశ్, ప్రధాన కార్యదర్శి అల్లేంకి లింగమూర్తి, మహిళా విభాగం అధ్యక్షురాలు పల్లా అపర్ణ కోరారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చినా నేటికీ అమలు చేయడం లేదన్నారు. ఈ క్రమంలో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



టీచర్ల ర్యాంకుల్లో గోల్‌మాల్!

- 317 జీవో టైంలో ఒకలా, పదోన్నతులు, బదిలీల్లో మరోలా!
- పొరపాటైతే సవరణకు, స్కాం అయితే విచారణకు టీచర్ల డిమాండ్
- తప్పుడు సీనియారిటీ చూపించినవారి పదోన్నతి రద్దు
- 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆర్జేడీ ఆదేశాలు

జీహెచ్‌ఎం పదోన్నతుల్లో కొన్ని పొరపాట్లు

సీనియారిటీ సంఖ్య	ప్రస్తుత ర్యాంకు	317 జాబితా ర్యాంకు
734	75	చూపించలేదు
736	182	158
743	217	175
762	300	194

బదిలీలు (గణిత ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టు

జిల్లా	సీనియారిటీ సంఖ్య	ప్రస్తుత ర్యాంకు	317 జాబితా ర్యాంకు
జగిత్యాల	02	675	2,163
జగిత్యాల	25	685	2,191
జగిత్యాల	31	334	681
సిరిసిల్ల	01	430	507
సిరిసిల్ల	02	221	568
సిరిసిల్ల	06	683	751

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

విద్యాశాఖ చేపట్టిన పదోన్నతులు, బదిలీలు వివాదాస్పదమవుతున్నాయి. ఇటీవల జీహెచ్‌ఎం బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. స్పందించిన విద్యాశాఖ కమిషనర్ దేవసేన చర్యలు తీసుకోవాలని డీఈవోలను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇది మరవరకముందే.. మరిన్ని వివాదాలు విద్యాశాఖను చుట్టుముడుతున్నాయి. ఓవైపు పదోన్నతులు, బదిలీల్లో అనేక పొరపాట్లు, తప్పులు దొర్లుతున్నాయని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ ప్రక్రియ జరుగుతున్న తీరుపై అనేక సందేహాలు వ్యక్తమయ్యేందుకు కారణమవుతోంది. తాజాగా నిర్మల్ డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న ఓస్కూల్ అసిస్టెంట్ సీనియారిటీ లేకున్నా.. పదోన్నతి పొందిన విషయమై ఆర్జేడీకి బాధిత టీచర్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి, పొరపాటు గ్రహించిన అధికారులు పదోన్నతి రద్దు చేసి, అర్హుడైన ఉపాధ్యాయుడికి పదోన్నతి కల్పించారు. సీనియారిటీలో వెనకబడి ఉన్నా.. పదోన్నతి ఎలా వచ్చిందో 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని సదరు టీచర్‌ను ఆర్జేడీ ఆదేశించారు.



జగిత్యాల డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

పదోన్నతుల్లో ప్రామాణికం..

2021లో 317 జీవో అమలులో భాగంగా పలువురు టీచర్లను సీనియారిటీ ఆధారంగా వివిధ జిల్లాలకు కేటాయించారు. అప్పుడున్న లిస్టులో డీఎస్సీ ర్యాంకులు స్థానికత నిర్ధారణలో కీలకంగా వ్యవహరించాయి. తాజాగా బదిలీలు, పదోన్నతుల్లోనూ అధికారులు వాటిని ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అయితే, చాలా జిల్లాల్లో ఈ ర్యాంకులు 317 జీవో సమయంలో ఒకలా, ప్రస్తుతం మరోలా ఉండటం చూసి తోటి టీచర్లు అవాక్కవుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు, పదోన్నతుల్లో ర్యాంకులకు, 317 జీవో సందర్భంగా జరిగిన కేటాయింపుల సమయంలో ఉన్న ర్యాంకుల్లో వ్యత్యాసాలు ఎందుకు వచ్చాయి? అన్న విషయం చర్చానీయాంశంగా మారింది. ముఖ్యంగా కరీంనగర్, పెద్దపల్లికి సంబంధించిన బదిలీల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకున్నా.. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో మాత్రం టీచర్ల ర్యాంకుల విషయంలో గతానికి, ప్రస్తుతానికి భారీ వ్యత్యాసాలు వెలుగుచూశాయి. దీనిపై అర్హులైన ఉపాధ్యాయులంతా అభ్యంతరం తెలియజేస్తూ.. తప్పులు సవరించాలని డీఈవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఉన్నతాధికారులు ఏం చెబుతారో?

317 జీవో అమలు సందర్భంగా స్థానికత విషయంలో టీచర్లకు అనేక చిక్కులు ఎదురయ్యాయి. ఆ సమయంలో డీఎస్సీ ర్యాంకులను కూడా ప్రామాణికంగా తీసుకుని జిల్లాలకు కేటాయించారు. తాజా పదోన్నతులు, బదిలీలకూ అవే కీలకం. ఈ రెండింటిలో భారీ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోన్న వేళ.. ఏ ర్యాంకులు నిజం? అన్న ప్రశ్నకు ఉన్నతాధికారులు సమాధానమివ్వాల్సి ఉంది. ఒకవేళ 317 బదిలీల్లో ఉపయోగించిన ర్యాంకులే పొరపాటైతే.. జిల్లాలకు జరిగిన టీచర్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగి ఉంటాయని టీచర్లు అనుమానిస్తున్నారు. లేదా ప్రస్తుతం పదోన్నతులు, బదిలీల్లో చూపించిన ర్యాంకుల్లో తప్పులు ఉంటే.. సవరించి న్యాయం చేయాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉద్దేశపూర్వకంగానే తప్పుడు వివరాలిచ్చారా?

317 జీవో సమయంలో విద్యాశాఖ టీచర్ల ర్యాంకులు పొందుపరిచింది. తాజా పదోన్నతులు, బదిలీల్లో మాత్రం హెచ్‌ఆర్‌ఎంఎస్ వెబ్‌సైట్‌లో స్వయంగా నమోదు చేసుకున్న ర్యాంకులను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అందువల్ల ఈ పొరపాట్లు, వ్యత్యాసాలు తలెత్తుతున్నాయని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు వివరాలు నమోదు చేసిన టీచర్లపై, సదరు సమాచారాన్ని ధ్రువీకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

'గుర్తింపు' నిర్వహిస్తారా.. వాయిదా వేస్తారా?



- ఇప్పుడే వద్దంటున్న 12 సంఘాలు
- కావాలంటున్న రెండు యూనియన్లు
- వాయిదా వైపే యాజమాన్యం మొగ్గు
- ఊగిసలాటలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు

గోదావరిఖని: ఇప్పుడే ఎన్నికలు వద్దని మెజార్టీ కార్మిక సంఘాలు.. షెడ్యూల్ ప్రకారమే నిర్వహించాలని రెండు యూనియన్లు.. నిర్వహణ కష్టమే అంటున్న సింగరేణి యాజమాన్యం.. ఈ నేథ్యంలో డిప్యూటీ సీఎల్‌సీ జారీచేసిన నోటిఫికేషన్ భవితవ్యం ప్రశ్నార్థకంగా తయారైంది. అసలు ఎన్నికలు నిర్వహిస్తారా? లేక వాయిదా వేస్తారా? అని కార్మికులు అయోమయంలో ఉన్నారు.

రెండేళ్ల జాప్యం తర్వాత..

- గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్ణీత గడువుకన్నా రెండేళ్ల జాప్యమైంది.
- తొలుత నాలుగేళ్ల కాలపరిమితికి ఎన్నికలు నిర్వహించారు. ఫలితాల వెల్లడి తర్వాత గడువు రెండేళ్లకు కుదించారు.
- విజయం సాధించిన గుర్తింపు యూనియన్ టీబీజీకేఎస్.. పదవీకాలం నాలుగేళ్లకు పెంచాలని కోర్టును ఆశ్రయించింది.
- ఈక్రమంలో కోవిడ్ మహమ్మారి ప్రభావంతో మరో రెండేళ్లు ఆలస్యమైంది.
- ఆలస్యంపై జాతీయ కార్మిక సంఘం ఏఐటీయూసీ కోర్టును ఆశ్రయించి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని విన్నవించింది.
- పలువాయిదాల నేపథ్యంలో వచ్చే అక్టోబర్‌లో ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఇటీవల సూచించింది.
- ఈనెల 27న డిప్యూటీ సీఎల్‌సీ సమావేశం నిర్వహించగా బీఎంఎస్, ఏఐటీయూసీ సమావేశానికి హాజరయ్యాయి.
- మిగతా 12 సంఘాలు సమావేశానికి దూరంగా ఉన్నాయి.
- సింగరేణి యాజమాన్యం కూడా సమావేశానికి హాజరు కాలేదు.
- కోర్టు ఆదేశాల ప్రకారం కార్మిక శాఖ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు.
- దీంతో 12 కార్మిక సంఘాలు అధికారుల తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.
- అన్ని సంఘాలకు సమాన ప్రాతినిధ్యం ఇస్తూ కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌పై కీలక చర్చలు జరుగుతున్న క్రమంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల ఏమిటని ప్రశ్నిస్తున్నాయి.
- మధ్యవర్తిగా ఉండాల్సిన కార్మిక శాఖ.. ఏకపక్షంగా వ్యవహరించిందని ఆగ్రహిం హిస్తున్నాయి.


షెడ్యూల్ ఏకపక్షం



యాజమాన్యం, కార్మిక సంఘాలు కలిసి నిర్ణయించేవి గుర్తింపు ఎన్నికలు. డిప్యూటీ సీఎల్‌సీ మధ్యవర్తిత్వం వహించాలి. కానీ, డిప్యూటీ సీఎల్‌సీ ఏకపక్షంగా వ్యవహరించారు. మెజార్టీ సంఘాలు దూరంగా ఉన్నప్పుడు కీలక నిర్ణయం తీసుకోవడం సరికాదు. యాజమాన్యం ఆసక్తిగా లేదు. వాయిదా వేయాలని 12 సంఘాలు లేఖ ఇచ్చాయి. ఎన్నికలు వాయిదా వేయాలి.

– కెంగర్ల మల్లయ్య, వర్కింగ్ పెసిడెంట్, టీబీజీకేఎస్

మెజార్టీ సంఘాలను గౌరవించాలి



అసెంబ్లీ ఎన్నికల తర్వాత గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి. అన్ని సంఘాలకు సమాన ప్రాతినిధ్యం లభిస్తోంది. ఈసమయంలో డిప్యూటీ సీఎల్‌సీ తొందరపడి నిర్ణయం తీసుకున్నారు. సమాన ప్రాతినిధ్యం ఏఐటీయూసీకి మింగుడు పడటంలేదు. ఎన్నికలకు మేం సిద్ధంగా ఉన్నాం. ఎన్నికలు వద్దంటున్న 12 సంఘాలను గౌరవించాలి.

– రియాజ్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి, హెచ్‌ఎంఎస్

కోడ్ ఆఫ్ డిసిప్లేన్ మార్చాకే..



కోడ్ ఆఫ్ డిసిప్లేన్ మార్చాకే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి. రెండు ఓట్ల పద్ధతి, రెండేళ్ల కాలపరిమితి, గెలిచినా, ఓడినా గేట్ మీటింగ్ నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలి. కార్మికుల ఆథరైజేషన్ తీసుకున్నాకే యూనియన్ సభ్యత్వ రుసుం వసూలు చేయాలి. బినామీ పేర్లు, డిపెండెంట్ వయసు 40ఏళ్లకు పెంచాలి. కోలిండియా మాదిరిగా పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ యాజమాన్యమే చెల్లించాలి. వీటిపై సర్క్యులర్ విడుదల చేయాలి.

– తుమ్మల రాజారెడ్డి, అధ్యక్షుడు, సీఐటీయూ

ఎన్నికలు నిర్వహించాలి



నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాల్సిందే. అన్ని సంఘాలు ఇప్పటికే ఎన్నికలకు అనుకూలంగా లేఖలు ఇచ్చాయి. యాజమాన్యం 12 సంఘాలను ప్లాన్‌ప్రకారం సమావేశానికి హాజరు కాకుండా చేసింది. ఈనెల 7న మేము ఎన్నికల్లో పాల్గొనేందుకు నామినేషన్ వేస్తాం. యాజమాన్యం కావాలనే వాయిదా వేయడాన్ని ఖండిస్తున్నాం.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- సభాస్థలి, ఏర్పాట్లు పరిశీలన

గోదావరిఖని: మంత్రి కేటీఆర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. స్థానిక సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో చేపట్టిన ఏర్పాట్లను ఎమ్మెల్యే కోరుకంటి చందర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. అక్టోబరు 1న మంత్రి పర్యటిస్తారని, అన్ని శాఖలు సమష్టిగా ఆ పర్యటన విజయవంతం చేయాలన్నారు. రామగుండం నియోజకవర్గంలో చేపట్టి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ఆయన వివరిస్తారని, దశాబ్ది ప్రగతిసభలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారని చెప్పారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ, పదేళ్లలో రామగుండంలో జరిగిన అభివృద్ధిని వివరించేందుకు మంత్రి కేటీఆర్ దశాబ్ది ప్రగతి సభకు వస్తారన్నారు. ఐటీ, ఇండస్ట్రియల్ పార్క్ పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న కుర్మకమ్మి భూసమస్యకు పరిష్కారం చూపామని, వాటి పట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 76, 58, 59 కింద పట్టాలు, బీసీ, మైనారిటీ చెక్కులు, దివ్యాంగులకు పింఛన్ ప్రొసీడింగ్స్ మంత్రి పంపిణీ చేస్తారని వివరించారు. సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కమిషనర్ నాగేశ్వరరావు, తహసీల్దార్ కుమారస్వామి, అధికారులు పాల్గొన్నారు.



స్టేడియంలో సభాస్థలి పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే చందర్

ఎరియర్స్ చెల్లించండి



సీజీఎంను సన్మానిస్తున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంలోని ఎరియర్స్‌ను దసరా పండుగకు ముందే చెల్లించాలని కార్మికులు, నాయకులు కోరారు. ఈమేరకు గురువారం ప్రాజెక్టు సీజీఎం కేదార్ రంజన్ పాండును కలిసి విన్నవించారు. ఎరియర్స్ వెంటనే చెల్లించేందుకు ఆదేశాలు ఇవ్వాలని, గత నెల 9న మస్టర్ కోల్పోయిన కార్మికులకు మస్టర్‌ను వేతనంలో జమ చేయాలని కోరారు. సీజీఎం సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, రాధారపు రాజమల్లయ్య, ఆర్.లక్ష్మణ్, సత్యంతోపాటు ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్ పాల్గొన్నారు.

ఉరుములు.. మెరుపులు.. భారీవర్షం



సుల్తానాబాద్‌లోని రోడ్లపై వరదనీరు

- అర్ధగంటపాటు కుండపోత
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుల్తానాబాద్(పెద్దపల్లి) : పట్టణంలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. సుమారు అర్ధగంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. అప్పటిదాకా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన పట్టణవాసులకు వర్షం ఎంతో ఊరటనిచ్చింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, భారీవర్షంతో రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా ఫుట్‌పాత్, తోపుడుబండ్ల వ్యాపారులు వర్షంతో నానాపాట్లు పడ్డారు. మరోవైపు.. ఈవర్షం రైతులకు ఎంతో మేలు చేస్తుందని చెబుతన్నారు. ఈ వానాకాలంలో సాగు చేసిన పంటలకు ఇప్పటి దాకా ఆశించిన స్థాయిలో నీళ్లు అందలేదు. ఈ వర్షంతో పంటలకు ఉపశమనం కలిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓదెల(పెద్దపల్లి): కొలనూర్, ఓదెల, ఉప్పరపల్లె, హరిపురం తదితర గ్రామాల్లో సుమారు రెండు గంటలపాటు భారీవర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పల్లెవాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఒకింత భయానికి గురయ్యారు. గంటపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది. అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విదుయత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఇంటి వద్దకే ఈకేవైసీ

- గ్రామాల బాటపట్టిన రేషన్ డీలర్లు
- బియ్యం పంపిణీలో అక్రమాలకు చెక్
- కుటుంబసభ్యుల నిర్ధారణకే ఈప్రక్రియ
- 'భోగస్' లబ్ధిదారుల పేర్లు తొలగింపు
- వేలిముద్రలు సేకరిస్తున్న డీలర్లు



- ఈఫొటోలోని వృద్ధురాలి పేరు మధునమ్మ. పెద్దపల్లి మండలం మారెడుగొండ స్వగ్రామం. ఈమె ఈకేవైసీ కోసం తన వేలిముద్ర వేసినా నమోదు కావడం లేదు. వేలిపై గీతలు లేనందున సమస్య తలెత్తింది. దీంతో రేషన్‌కార్డు రద్దవుతుందని ఆందోళన చెందుతోంది.
- ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వెళ్లిన కుటుంబాలకు చెందినవారు సైతం తమవాళ్ల ఈకేవైసీ నమోదు కాకపోతే రేషన్ కార్డు నుంచి పేరు తొలగిస్తారని ఆందోళన చెందుతున్నారు.



మారెడుగొండలో ఇంటివద్దకే వెళ్లి వృద్ధురాలి వేలిముద్ర సేకరిస్తున్న రేషన్ డీలర్

పెద్దపల్లిరూరల్: రేషన్‌కార్డులో పేర్లు ఉన్నవారికి ప్రభుత్వం రేషన్ బియ్యం మాత్రమే అందిస్తోంది. అయితే స్థానికంగా లేనివారి పేర్లపై బియ్యం పంపిణీ చేస్తున్నట్లు అనుమానించిన అధికారులు, పాలకులు.. కుటుంసభ్యుల సంఖ్య పక్కాగా తేల్చాలని నిర్ణయించారు. ఈమేరకు ఈకేవైసీని అమలులోకి తీసుకొచ్చారు. ఇప్పటికీ కుటుంబీకుల్లో చనిపోయిన, వివాహాలు అయి అత్తగారింటికి వెళ్లిన లబ్ధిదారుల పేరిట బియ్యం పోస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాపై భారంపడుతోందని భావించిన అధికారయంత్రాంగం.. భోగస్ లబ్ధిదారులను గుర్తించి వారి పేర్లను తొలగించేందుకు ఈకేవైసీ చేపట్టింది.

వేలిముద్ర వేస్తేనే...

- రేషన్ డీలర్ల వద్దకు రేషన్ కార్డులో పేర్లుఉన్న కుటుంబసభ్యులు అందరూ దుకాణానికి వెళ్లి వేలిముద్రవేయాల్సిందే.
- లేదంటే వారిపేరిట వచ్చే రేషన్ కోటా కట్ చేస్తారు.
- పెద్దపల్లితోపాటు పలు గ్రామాల్లో కొందరు రేషన్ డీలర్లు ఈ పాస్ మిషన్లు వెంట తీసుకుని ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల వేలిముద్రలు సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియను రెండు నెలల్లో పూర్తిచేయాలని సివిల్ సప్లయి కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు అందినట్లు సమాచారం.
- వేలిముద్ర రాకుంటే ఐరిష్ ద్వారా వివరాలు నమోదు చేయాల్సి ఉంది.
- అయితే ఐరిష్ అందుబాటులో లేక లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- కుటుంబ సభ్యుల్లో కొందరు లేకున్నా వారిపేరిట ఆరు కిలోల చొప్పున బియ్యం తీసుకుంటున్నారని, ఈకేవైసీ అసలైన లబ్ధిదారులనే గుర్తించడం ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని ప్రభుత్వం భావిస్తోంది.
- ఈపాస్ మిషన్‌పై వేలిముద్ర వేయగానే ఆధార్ నంబరు చూపిస్తుంది.
- యంత్రంలో వేలిముద్ర వేసిన లబ్ధిదారు పేరుపై ఆకుపచ్చ రంగు రావడంతో ప్రక్రియ పూర్తవుతుంది.

జిల్లా సమాచారం

మండలాలు	14
పంచాయతీలు	267
రేషన్ దుకాణాలు	413
రేషన్‌కార్డులు	2,10,147
అంత్యోదయకార్డులు	12,297
అన్నపూర్ణ కార్డులు	175
లబ్ధిదారులు(యూనిట్లు)	6,27,841

క్లుప్తంగా

నియామకం


వెంకటరమణ

రామగుండం: గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన క్యాతం వెంకటరమణను ఆసిఫాబాద్ కొమురంభీమ్ జిల్లా బీజేపీ అసెంబ్లీ ప్రభారిగా నియమించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు అందజేశారు. వెంకటరమణ ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే ప్రజా సంబంధాల సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు.

సభ విజయవంతం చేయాలి

ధర్మారం: ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ఈనెల 3న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టిన పర్యటను విజయవంతం చేయాలని సహకార సంఘాల పోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గురువారం మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ కేటీఆర్ సభకు అధికసంఖ్యలో ప్రజలు తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుస్కూరి జితేందర్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పరి చంద్రయ్య, ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

వార్డుసభ్యురాలి మృతి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే చందర్

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం గుంటూరుపల్లి 6వ వార్డు సభ్యురాలు యెన్న అనూష (30) గురువారం మృతి చెందారు. ఆమె రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఆరోగ్య పరిస్థితి విషమించి చనిపోయారు. మృతురాలి భర్త శివారెడ్డి బీఆర్‌ఎస్ నాయకుడిగా సేవలు అందించారు. ఆయన గతంలోనే చనిపోయారు. ఆయన భార్య అనూష విషజ్వరంతో మృతి చెందడంతో వారి ఇద్దరు కుమారులు దిక్కులు చూస్తున్నారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. సర్పంచ్ పసువుల నాగలక్ష్మి, ఉపసర్పంచ్ మెట్టు రామదాసురెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి.. క్షణికావేశానికి లోనై..

జూలపల్లి(పెద్దపల్లి): రోజూ ఎందుకు మద్యం తాగుతున్నావని భార్య, కుటుంబ సభ్యులు మందలించడంతో క్షణికావేశానికి లోనైన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వడ్కాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తోటపెల్లి సంతోష్(32) జూలపల్లిలోని హోటల్‌లో పనిచేస్తున్నాడు. రోజూ మద్యం తాగే అలవాటు ఉంది. ఈక్రమంలో బుధవారం గణేశ్ నిమజ్జనం సందర్భంగా అతిగా మద్యం తాగాడు. ఆ మత్తులోనే ఇంటికి వెళ్లాడు. రోజూ మద్యం తాగితే బతుకు దెరువు ఎలా? అని మందలించారు. దీంతో సమీపంలోనే నివాసం ఉండే అతడి చెల్లెలు ఇంటికి వెళ్లి పురుగుల మందు తాగాడు. ఆ వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య కవిత, ,కొడుకు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
LAND FOR SALE

■ మొగ్దుంపూర్ లో 9.5గుంటల భూమి అమ్మబడును. కరీంనగర్ to పెద్దపల్లి హైవే నుండి 500మీ. గుంట 5 లక్షలు. ఫోన్ : 9989126840. [HA-95141]

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K Ph: 9640468899/ 9640258899 [H-189336

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

మంత్రి కేటీఆర్‌పైనే భారం

- టెక్స్‌టైల్స్ భూ సమస్యలు పరిష్కరించాలని విన్నపం
- అక్టోబర్ ఒకటిన రామగుండంలో మంత్రి కేటీఆర్ పర్యటన


మూతపడిన స్పిన్నింగ్ మిల్లు

రామగుండం: అంతర్గాం మండలం పెద్దంపేట, రాయదండి శివారుల్లో సుమారు ఆరు దశాబ్దాల క్రితం అజామాబాద్ ఇండస్ట్రియల్ పేరిట నిజాం పాలకులు సేకరించిన భూములు సమస్యల్లో చిక్కుకోగా ఇటీవల పరిష్కారమయ్యాయి. ఇదే తీరులో నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంటున్న అంతర్గాం టెక్స్‌టైల్ భూసమస్యకూ పరిష్కారం లభిస్తుందని మిల్లు కార్మికులు ఆశిస్తున్నారు. అక్టోబర్ ఒకటో తేదీన ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రామగుండంలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా భూసమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే కోరుకంటి అవకాశం కల్పించాలని బర్మా, కాందీశీకుల కుటుంబాలు విన్నవిస్తున్నాయి.

టెక్స్‌టైల్ భూ సమస్య, పరిహారం వివరాలు..

- 1967లో అంతర్గాం పునరావాస కేంద్రం ఏర్పాటుకు గ్రామ శివారులో 502 ఎకరాలు సేకరించారు.
- ఇందులో అజామాబాద్ ఇండస్ట్రియల్‌కు చెందినవారి పేరిట 71.39 ఎకరాలు, రాయదండి -గోలివాడ శివారులోని 96.10 ఎకరాల పట్టా భూములు, రాయదండిలోని 189.03 ఎకరాల ప్రభుత్వ భూములు, గోలివాడలోని 165.10 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉంది.
- 1971 జూలై 7వ తేదీన వీవింగ్, స్పిన్నింగ్ మిల్లులు ప్రారంభించారు.
- వరుస నష్టాలతో వీవింగ్ మిల్లులో 9 జూన్ 1985న లాకౌట్ విధించారు. దీంతో 197 మంది ఉపాధి కోల్పోయారు. ఇందులోని 143మంది వివిధ కారణాలతో మరణించారు.
- నష్టాలు వస్తున్నాయనే కారణంతో స్పిన్నింగ్ మిల్లును కూడా 2 నవంబర్ 1991న మూసివేశారు.
- దీంతో 434 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. వీరికి ఇంకా బకాయిలు చెల్లించనే లేదు.
- మిల్లు ఆస్తులు విక్రయించి బకాయిలు చెల్లించాలని ఆనాటి ప్రభుత్వం నిర్ణయించింది.
- జాయింట్ కలెక్టర్ హోదాలో ఉన్నవారికి లిక్విడేటర్‌గా బాధ్యతలు అప్పగించింది.
- అయితే, వీవింగ్ సొసైటీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండానే 2006లో సొసైటీకి చెందిన 502 ఎకరాల మిల్లు భూముల నుంచి 324 ఎకరాలను ప్రభుత్వ భూములుగా గుర్తించారు. మళ్లీ రెవెన్యూ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- పునరావాస కేంద్రానికి చెందిన 102 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదించారు.
- 1989నాటి ఉత్తర్వులను అనుసరించి కేంద్ర ప్రభుత్వ పునరావాస హౌసింగ్ రుణాలతో పది గుంటల్లో నిర్మించిన కాలనీలో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని 374 మంది కాందీశీకులు హైకోర్టును ఆశ్రయించారు.
- అయితే, 279 మంది స్థానిక కార్మికులకు ప్రభుత్వం ప్రతిపాదించినట్లు ఐదు గుంటలు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు.
- బర్మా, కాందీశీకుల కార్మికుల ఇళ్లకు 150 ఎకరాలు అవసరమైతే.. ప్రస్తుతం లిక్విడేటర్ అధీనంలోనే 177 ఎకరాల సొసైటీ భూములు ఉన్నాయి.
- దీంతో కార్మికుల కోసం అదనంగా సేకరించాల్సిన భూముల అవసరం ఏమీ లేదని బర్మా, కాందీశీకులు అంటున్నారు.

బతికుండానే పరిష్కరించండి



కార్మికులు శ్రమ దోపిడీకి గురయ్యారు. మిల్లులు మూసివేశాక పరిహారానికి కూడా నోచుకోలేదు. వీవింగ్ సొసైటీ, మా పేర్ల పేరిట కొనుగోలు చేసిన భూముల్లో నుంచి ప్రతీ కార్మికుడికి పది గుంటలు పట్టాలు చేసి అందించాలి. ఆరు దశాబ్దాల క్రితం నిజాం పాలకుల నాటి భూసమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే చందర్.. అంతర్గాం భూసమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలి. మిల్లు భూముల్లో ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్క్‌లో ఉపాధి కల్పనకు ప్రత్యేక కోటా అమలు చేయాలి. వయోభారంతో ఇప్పటికే 70శాతం మంది కార్మికులు మృతిచెందారు. మిగిలినవారు బతికుండగానే భూసమస్య పరిష్కరించాలి.

– జమ్ముల రామారావు, బర్మా, కాందీశీకుల సంఘం అధ్యక్షుడు

బొగ్గుబాయి వార్తలు

సమానహోదా ఇచ్చాక ఎన్నిలు ఎందుకు?

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ


మాట్లాడుతున్న ఐ.కృష్ణ

గోదావరిఖని:అన్నికార్మిక సంఘాలకు సమానహోదా ఇచ్చాక సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలకు తొందర ఎందుకని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ ప్రశ్నించారు. తమ పోరాటాలతోనే అన్ని యూనియన్లకు సమాన హోదా లభించిందన్నారు. నగరంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో కార్మిక సంఘాల మెడకు ఉరితాడై వేలాడుతున్న కోడ్ ఆఫ్ డిసిప్లేను మార్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని అనేక దఫాలుగా డిమాండ్ చేశామని గుర్తు చేశారు. కార్మిక సంఘాలను అంతం చేయాలనే కుట్రలో భాగంగానే మెంబర్‌షిప్ చేసుకోవడానికి కోడ్ ఆఫ్ డిసిప్లేన్ అడ్డుగా చేశారని ఆరోపించారు. మెజార్టీ కార్మిక సంఘాలను గౌరవించి ఎన్నికలు వాయిదా వేయాలని ఆయన కోరారు. ఎన్నికలు జరిగేంతవరకు యాజమాన్యం విడుదల చేసిన సర్క్యులర్ గని నుంచి కార్పొరేట్ స్థాయి వరకు ఆచరణలో పెట్టాలని అన్నారు. సమావేశంలో నాయకులు ఎస్.మల్లేశ్, ఎం.కొమరయ్య, బాబు, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ఆదేశం


జీడీకే-2ఏ మోరీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: భారీవర్షాల సమయంలో వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం జీడీకే–2ఏ మోరీ, జనగామ గ్రామాలను సందర్శించారు. భారీవర్షాలు కురిసినప్పుడు గోదావరిఖనిలోని పలు కాలనీల నుంచి వచ్చే మురుగు జీడీకే–2ఏ మోరి(అండర్ పాస్) వద్ద అధిక మొత్తంలో నిలుస్తోందన్నారు. తద్వారా వాహన రాకపోకలకు ఇబ్బంది తలెత్తుతోందని తెలిపారు. ఈమేరకు తగిన మరమ్మతులు చేయాలని సూచించారు. అనంతరం జనగామ గ్రామాన్ని సందర్శించారు. భారీ వర్షాలతో గోదావరి నది వరద ఉధృతితో దెబ్బతిన్న సీసీరోడ్డు, కల్వర్ట్ పరిశీలించారు. కల్వర్టు దెబ్బతినటంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే మరమతులు చేయాలని సూచించారు. ఆయన వెంట డీజీఎం(సివిల్) నాగేశ్వర్‌రావు, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ ఏజీఎం రవికుమార్ మృతి


రవికుమార్(ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): సింగరేణి రిటైర్డ్ ఏజీఎం పోతుల రవికుమార్ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లో నివాసం ఉంటున్న రవికుమార్.. సింగరేణి సంస్థలో 1981లో విధుల్లో చేరి అంచెలంచెలుగా ఏజీఎం స్థాయికి ఎదిగారు. పలు ఏరియాల్లో అధికారిగా పనిచేసినా సౌమ్యుడిగా అందరి మన్ననలు పొందారు. ఆయన మృతితో ఎన్టీపీసీ, గోదావరిఖనిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య అ మృత, కుమార్తె ఉజ్వ ల ఉన్నా రు. కళాకారుడు, క్రీ డాకారుడు చంద్రపాల్‌కు రవికుమార్ సోదరుడు. ఆయన మృతికి సింగరేణి అధికారులు, సహచరులు, పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

కార్యకర్తలను బలిచేయొద్దు

- ప్రజావ్యతిరేకతను మరిపించలేరు


మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: అధికార పార్టీపై వస్తున్న ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక ప్రతిపక్ష పార్టీలపై తప్పుడు విమర్శలు, అడ్డుకోవటాలు చేస్తే సహించేదిలేదని అమాయకులను బలిచేయవద్దని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పోలీసులు గురువారం లక్ష్మణ్‌కుమార్‌తోపాటు నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం విడుదల చేశారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో లక్ష్మణ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. మేడారంలో జరిగిన ఘటనపై ముందస్తుగా పోలీసులతో అరెస్టు చేయించటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాను కటికనపల్లిలో జరిగే అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్తుంటే పోలీసులు బలవంతంగా ఠాణాకు తరలించారని విమర్శించారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహిపాల్, నాయకులు కాంపెల్లి రాజేశం, ఎదుల్ల అంజయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు రెడీ


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

- బండి సంజయ్ సవాల్ స్వీకరిస్తున్నాం
- సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

కరీంనగర్: సీఎం కేసీఆర్, కేటీఆర్‌లపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విసిరిన సవాల్‌కు తాము సిద్ధంగా ఉన్నామని, తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తామని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని భాగ్యలక్ష్మి, కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయాలలో ఎక్కడైనా.. ఎప్పుడైనా చర్చకు సిద్ధమని ప్రతిసవాల్ విసిరారు. నాలుగేళ్లలో ఎంపీగా పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధి ఏమిటో వెల్లడించాలని కోరారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తర్వాత ఒక్కరోజు ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో లేరన్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులుగా ఎంపిక చేస్తామని డబ్బుల వసూళ్లకు పాల్పడడంతోనే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించారన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్, కెమసారం తిరుపతి,తుల భాస్కర్‌రావు, గాలి రవియాదవ్ పాల్గొన్నారు.

లంబోదరా.. సెలవిక


అమర్‌నగర్‌లోని భారీ వినాయక విగ్రహం శోభాయాత్రలో ఆటాపాటలు


పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని అమర్‌నగర్ భారీ గణేశుడి నిమజ్జనోత్సవం గురువారం వైభవంగా జరిగింది. పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువు(మినీ ట్యాంక్‌బండ్) వరకు కన్నులపండువగా శోభాయాత్ర నిర్వహించారు. అంతకుముందు మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, కౌన్సిలర్ దేవనంది రమాదేవి తదితరులు ప్రత్యేకపూజలు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు మట్టి గణేశుడి నిమజ్జనం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కొలువుదీరిన 47అడుగుల భారీ మట్టిగణేశుని నిమజ్జనం శనివారం అక్కడే నిర్వహిస్తారు. ఇందుకోసం అవసరమైన అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు నిర్వాహకుడు, ఛత్రపతి యువసేన అధ్యకుడు శివంగారి సతీశ్ తెలిపారు.

ఇస్రో సైంటిస్టుగా సిరిసిల్ల కుర్రాడు

- తిరువనంతపురంలో నియామకం
- విద్యార్థి దశ నుంచే పరిశోధనలపై మక్కువ



ఉద్యోగం సాధించిన మంచికట్ల సుశాంత్‌వర్మ(ఫైల్), తల్లిదండ్రులు సుధారాణి- రాజేశంతో..

సిరిసిల్ల: సిరిసిల్ల చిన్నోడు మంచికట్ల సుశాంత్‌వర్మ తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)లో సైంటిస్టుగా నియామకమయ్యారు. సుశాంత్‌వర్మ ప్రాథమికవిద్య కరీంనగర్ కేంద్రీయ విద్యాలయంలో పూర్తిచేశారు. వివేకానంద కాలేజీలో ఇంటర్ పూర్తిచేసి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ టెక్నాలజీలో బీటెక్ పూర్తిచేశారు. బీటెక్ పూర్తికాగానే సుశాంత్‌వర్మ మెరిట్ విద్యార్థిగా ఇస్రోలో సైంటిస్టుగా ఉద్యోగం సాధించాడు. సుశాంత్‌వర్మ చిన్నప్పటి నుంచి పరిశోధనలపై ఆసక్తి కనబరిచేవారు. సుశాంత్ తల్లి సుధారాణి బోయినపల్లి మండలం వర్ధవెల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయురా. తండ్రి రాజేశం సిరిసిల్ల మున్సిపల్ మెప్మా విభాగంలో కో–ఆర్డినేటర్. సుశాంత్‌వర్మ ఉద్యోగంలో చేరడంతో తల్లిదండ్రులు సుధారాణి, రాజేశం గురువారం సంతోషాన్ని వ్యక్తం చేశారు.





రోడ్డంతా పొగబారినట్లు..

పెద్దపల్లి - సెంటినరీకాలనీ మధ్య రాణీరుద్రమదేవి స్టేడియం ప్రధాన చౌరస్తా వద్ద రోడ్డు శిథిలమైంది. నిత్యం వందలాది భారీవాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి లేచి దారి కనిపించక వాహనదారులు నానాఅవస్థలు పడుతున్నారు. రోడ్డు వెంటఉన్న ఇళ్లలోకి దుమ్ము, ధూళి వచ్చి చేరడంతో స్థానికులు వ్యాధుల బారినపడుతున్నారు. ప్రయాణికులకూ తిప్పలు తప్పడంలేదు. సమస్య తీవ్రతకు అద్దంపడుతున్న ఈ చిత్రాలను 'సాక్షి చిత్రీకరించింది. అధికారులు స్పందించి రహదారి మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

రామగిరి ఖిల్లా సందర్శన


ఖిల్లాపై అదనపు కలెక్టర్, ఆర్డీవో, సాహితీవేత్తలు

రామగిరి: అద్భుత కళాసంపదకు నిలయమైన రామగిరి ఖిల్లాను అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ గురువారం సందర్శించారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన సుమారు 150 మంది సాహిత్తవేత్తలతో కలిసి ఆయన ఖిల్లాపై పర్యటించారు. ప్రాచీన కట్టడాలు, కోటలు పరిశీలించారు. బేగంపేట గ్రామం నుంచి ఉదయమే కాలినడకనగా బయలుదేరిన ఆయన.. పురాతన కోటలు, ఫిరంగులు, సీతమ్మకొలు, సొరంగాలు తిలకించారు. ఖిలాపై ఆలయంలో పూజలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన సాహిత్తవేత్తలను కట్టడాలు అబ్బురపరిచాయి. ప్రాచీన కళావైభవం చాటుతూ నేటికి పర్యాటలను ఆహ్లాదపరుస్తున్న కోటలు, కట్టడాలు అద్భుతంగా ఉన్నాయని శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. మంథని ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్ రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.